క్లుప్తంగా

విద్యార్థుల ప్రగతి ఆధారంగా బోధన చేయాలి



కాకుమాను: విద్యార్థుల ప్రగతిని బట్టి ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎంఈఓ కె.ఎఫ్. కెనడీ అన్నారు. మండల కేంద్రం కాకుమాను ఉర్దూ పాఠశాలను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదుల్లోని విద్యార్థులను ఏ,బీ,సీ,డీ గ్రూపులుగా విభజించి వారి వారి ప్రగతిని బట్టి బోధన చేయాలని ఆయన సూచించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈసందర్భంగా విద్యార్థుల ప్రగతి, పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం అమలును ఎంఈఓ పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం మహ్మద్ రిహాన ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పొన్నూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, జనసేన పార్టీ పొన్నూరు సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు పాల్గొన్నారు. మునిపల్లెలో రూ.4 లక్షలు, మామిళ్లపల్లిలో రూ.13.50 లక్షలు, బ్రాహ్మణకోడూరులో రూ.5 లక్షలు, మన్నవలో రూ.5 లక్షలు, దొప్పలపూడిలో రూ.6.50 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లు, డ్రెయిన్‌లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, బొర్ర రామారావు, బండ్లమూడి బాబురావు పాల్గొన్నారు.

నారాకోడూరులో మహిళ మృతదేహం లభ్యం

చేబ్రోలు: గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం గుర్తించారు. వివరాలు.. చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామశివారులోని ఈస్ట్రన్ కంపెనీ సమీపంలోని రియల్ ఎస్టేట్ వెంచర్‌లో అనుమానాస్పద స్థితిలో సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయసు కలిగిన మహిళ మృతి చెందింది. మహిళపై ఎటువంటి గాయాలు లేకపోవటం, పురుగుమందు తాగిన ఆనవాళ్లు లేకపోవటంతో పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ డి.వెంకటకృష్ణ కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

గుంటూరు రూరల్: పంటల్లో నష్టం, అప్పుల బాధతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. మండలంలోని చిన్న కోండ్రుపాడు గ్రామానికి చెందిన గడ్డం గోపాలకృష్ణ(31) ఐదు ఎకరాలు సాగు చేస్తున్నాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. మూడేళ్లుగా పంటల్లో తీవ్ర నష్టాలను చవిచూస్తున్నాడు. మనస్తాపానికి గురయ్యాడు. గురువారం ఇంటి నుంచి పొలం వెళుతున్నానని చెప్పి వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి రాలేదు. ఇంట్లోని వారు ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవటంతో శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిచూడగా విగతజీవుడై పడి ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అండర్-9 రాష్ట్ర పోటీల్లో చేతన్‌కు ప్రథమ బహుమతి



గుంటూరు వెస్ట్: ఇటీవల గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో అండర్-9 విభాగంలో తమ అకాడమి విద్యార్థి ఎం.చేతన్‌కు బంగారు పతకం, అండర్-7 పి.గగన్‌కు తృతీయ స్థానం లభించిందని రూప్‌రైడర్స్ చెస్ అకాడమి కోచ్ ఎస్.రాంబాబు శుక్రవారం తెలిపారు. ఇటీవల చిన్నారులు ఇద్దరూ జిల్లా పోటీల్లో నిలకడగా రాణిస్తున్నారని చెప్పారు. చిన్నారులకు పలువురు అభినందనలు తెలిపారు.

నేడు రజక సంఘం ఆధ్వర్యంలో బహిరంగ సభ

నెహ్రూనగర్: గుంటూరు టౌన్ రజక జన సేవ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని ఎర్ర చెరువు పరిరక్షణకు శనివారం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు తెలిపారు. పాత గుంటూరులోని శ్రీ గంగానమ్మ కమ్యూనిటీ హాల్‌లో సభ నిర్వహించనున్నట్లు శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు నడిబొడ్డులోని ఎర్రచెరువును కబ్జా చేసేందుకు అధికార పార్టీని అడ్డుపెట్టుకుని కొంత మంది కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు.

5 తరగతులు.. 29 మంది పిల్లలు

- ఇద్దరు టీచర్లు..
- రెండు తరగతి గదుల్లో అందరికీ పాఠాలు
- ఇదీ మునిపల్లె ఎంపీయూపీ పాఠశాలలో పరిస్థితి
- మండల విద్యాశాఖలో కొరవడిన పర్యవేక్షణ



మునిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల



ఒకే గదిలో 4,5 తరగతులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయురాలు

పొన్నూరు: పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. పిల్లలను చేర్పించేందుకు శ్రద్ధ పెట్టడం లేదు. దీంతో పిల్లల సంఖ్య తగ్గుతోంది. కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం, మండల విద్యాశాఖ నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ తీరు దయనీయంగా మారింది.

పాఠశాల దుస్థితి..

ప్రధానంగా మండల పరిధిలోని మునిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మూడు పదులు కూడా దాటలేదు. పాఠశాలలో ఒకటి నుంచి 5 తరగతులకు 29 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకటో తరగతి 7 మంది విద్యార్థులు, రెండో తరగతి 5, మూడో తరగతి 4, నాలుగో తరగతి 8, ఐదో తరగతి 5 మంది విద్యార్థులకు ఇరువురు టీచర్లు మాత్రమే విద్యను బోధిస్తున్నారు. అయితే ఒక తరగతి వారికి ఒక టీచర్ ఉండాల్సి ఉండగా, మూడు తరగతులకు ఒకే సమయం, ఒకే తరగతి గదిలో పాఠాలు చెబుతున్నారు. ఐదు తరగతులకు ఐదుగురు టీచర్లు ఉండాల్సినప్పటికీ, ఇద్దరు టీచర్లతో కొనసాగిస్తున్నట్లు విమర్శలున్నాయి. అన్ని తరగతి గదులు వినియోగంలో లేక పంచాయతీ సిబ్బంది వినియోగించుకుంటున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

పనిచేయని ఆర్వోప్లాంటు..

ఆర్వోప్లాంటు కూడా పనిచేయకపోవడంతో విద్యార్థులు కుళాయి నీటినే తాగాల్సిన పరిస్థితి. విశాలమైన ప్రదేశం, పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం, నాడు- నేడుతో అభివృద్ధి, ప్రధాన రహదారిపై ఉన్న పాఠశాల ఆదరణ తగ్గడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల విద్యాశాఖ నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రభుత్వ పాఠశాలలను వదిలి ప్రైవేటు పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు మక్కువ చూపుతున్నట్లు సమాచారం.



పాఠశాలలో పనిచేయని ఆరో ప్లాంట్



ఒకటి నుంచి 3 వరకు తరగతులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు



పంచాయతీ సిబ్బంది వినియోగించుకుంటున్న పాఠశాలలోని ఓ గది

విద్యాభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట

విద్యాభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పెద్దపీట వేసింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలతో విద్యారంగం అన్ని విధాలుగా అభివృద్ధి చెందింది. నాడు-నేడు మనబడి కార్యక్రమంతో దశాబ్దాలుగా శిథిలమై ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచడంతో పాటు పాఠశాలలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పుస్తకాలు, బూట్లు, బ్యాగులతోపాటు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించారు. వాటితో పాటు ప్రతి ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలో అమ్మ ఒడి పథకం అమలు చేసి తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమచేసి పేద విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటు నందించారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు.

ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో అదే పరిస్థితి

ప్రస్తుతం మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల శాతం చాలా వరకు తగ్గింది. విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల్లో మూడు తరగతిలో విద్యార్థులను ఒకే తరగతి గదిలో పాఠాలు చెప్పవచ్చు. మండలంలోని పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. విద్యార్థులు సంఖ్య తగ్గడంతో సర్దుబాటు చేస్తున్నాం.

-శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ, పొన్నూరు

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

పొన్నూరు: పొన్నూరు ఆర్టీసీ డిపో పరిధిలో డయల్ యువర్ డిపో మేనేజర్ శనివారం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ అజిత కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, సలహాలు తెలియజేసేందుకు ఉదయం 10 గంటల నుంచి 11 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 9959225267 నంబర్‌కు డయల్ చేసి ప్రయాణికులు సమస్యలు తెలియజేయాలని కోరారు.

21న అష్టావధాన కార్యక్రమం



పొన్నూరు: బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో ఈనెల 21న బ్రాహ్మణ బజార్లోని శంకర మఠంలో అష్టావధాన కార్యక్రమం నిర్వహించనున్న బ్రాహ్మణ మహాసభ పూర్వాధ్యక్షులు పులిపాక వెంకట సత్య సాయి వరప్రసాద్ తెలిపారు.

శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అద్దంకికి చెందిన అవధాని నారాయణ బాలసుబ్రహ్మణ్యం నిర్వహణలో కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సాహిత్య అభిమానులు, పట్టణ ప్రముఖులు, తెలుగు భాషాభిమానులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో విశ్రాంత తెలుగు పండితులు ఎం.కృష్ణ కిషోర్, మహాసభ సభ్యులు దేశరాజు బాలగంగాధర్ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం ధర్నా



పెదకాకానిలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పెదకాకాని: ప్రభుత్వం ఎన్నికలకు ముందు అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ చార్జీలు పెంచమని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వై.నేతాజి పేర్కొన్నారు. శుక్రవారం విద్యుత్ చార్జీలు పెంచే ప్రయత్నాలను విరమించుకోవాలని కోరుతూ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

నేతాజీ మాట్లాడుతూ సుమారు 8 వేల కోట్ల రూపాయలు విద్యుత్ వినియోగదారుల నుంచి విద్యుత్ చార్జీలు వసూలు చేసుకొనుటకు అనుమతి ఇవ్వాలని డిస్కంలు ఎలక్ట్రిసిటీ రేగులేషన్ కమిషన్‌కు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. అందుకు అనుగుణంగా రెగ్యులేటరీ కమిషన్, పబ్లిక్ హియరింగ్‌కు నోటీసులు జారీ చేసిందని చెప్పారు. గతంలో కూడా ఇలాగే జరిగి విద్యుత్ చార్జీలు పెంచి వసూలు చేసేందుకు అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల నిత్య జీవిత సరకులు, కూరగాయలు ఆకుకూరలు, పండ్లు, హోటల్‌లో తిను బండారాల ధరలు బాగా పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ చార్జీలు పెంచితే వాటి ధరలు మరింత పెరిగి ప్రజలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. డిస్కంలు పెట్టిన ప్రతి పాదనలను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి ఆ భారం ప్రజలపై పడకుండా చూడాలని కోరారు.

ధర్నా అనంతరం ఏఈ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, నాయకులు ఉల్లంగుల శివయ్య, కె.సత్యనారాయణ, ఆర్.వెంకటరమణ, పూర్ణకంటి నాగమణి, లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

ముగిసిన శ్రీమద్భగవద్గీతపై ఆధ్యాత్మిక ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణవేదికపై శుక్రవారం రాత్రి శ్రీమద్భగవద్గీతలోని దశమ అధ్యాయంపై ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. బండ్లమూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్మయా మిషన్ బ్రహ్మచారి సువీరా నందస్వామి సందేశాన్ని అందించారు.

వీవీఐటీలో ప్రయుక్తి- 2024 సాంకేతిక సదస్సు



సదస్సులో పాల్గొన్న కోట కార్పొరేషన్ చీఫ్ కన్సల్టెంట్ సుమన్, ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి

పెదకాకాని: పరిశ్రమ అవసరాలను అనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావాలని కోట కార్పొరేషన్ చీఫ్ కన్సల్టెంట్ కోమ సుమన్ అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్, నిర్మాణభ్రష్ట విద్యార్థి విభాగంఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సు, ప్రయుక్తి 2కె24 సాంకేతిక వేడుకలను ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కోట కార్పొరేషన్ చీఫ్ కన్సల్టెంట్ కోట సుమన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోట సుమన్, సివిల్ ఇంజినీర్లు నిర్మాణాలలో అర్టిఫిషిల్ ఇంటలెజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వినియోగం ద్వారా నిర్మాణాల నాణ్యతను ఏవిధంగా తెలుసుకోవచ్చో విద్యార్థులకు వివరించారు. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టు విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు. రెండురోజులపాటు నిర్వహించనున్న సదస్సులో క్లాష్ ఆఫ్ మైన్స్, క్రిప్టిక్ క్విస్ట్, స్ట్రక్చరల్ కనెక్టివిటీ, క్లాష్ ఆఫ్ క్యాడ్ అంశాలపై సాంకేతిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు వివిధ సాంకేతిక కళాశాలల నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అడ్మిన్ డీన్ డాక్టర్ కుమారస్వామి, సివిల్ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీధర్ బాబు , సంధానకర్త చందన సుభేష్ పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన



నెహ్రూనగర్: ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని, ఇందులో భాగంగా ప్రజలకు తగిన అవగహన కల్పిస్తామని ప్రజారోగ్యధికారులు తెలిపారు. శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన ఇదేనా 'ప్రత్యేక' డ్రైవ్ అనే కథనానికి నగరపాలక సంస్థ ప్రజారోగ్యధికారులు స్పందించారు. రత్నపురి కాలనీలో రోడ్లపై ఉన్న చెత్త, కృష్ణనగర్‌లో అధ్వానంగా ఉన్న డంపర్ బిన్‌ను శుభ్రం చేయించారు. సాక్షి కథనానికి స్పందించి మా ప్రాంతంలో పారిశుద్ధ్యం మెరుగుపరచడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ని ముమ్మరంగా చేపట్టాలి

అదనపు కమిషనర్ ఓబులు



నగరంలో శానిటేషన్‌ను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ ఓబులు

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ ప్రత్యేకంగా చేపట్టిన 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ని ముమ్మరం చేయాలని, డ్రైవ్ పర్యవేక్షణకు విధులు కేటాయించబడిన అధికారులు మరింత శ్రద్ధగా పర్యవేక్షణ చేయాలని అదనపు కమిషనర్ ఓబులు కోరారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుకోవడానికే 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టామని, డ్రైవ్ పర్యవేక్షణకు విధులు కేటాయించబడిన 22 మంది సీనియర్ అధికారులు మరింత శ్రద్ధ చూపాలన్నారు. ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కి అంతరాయం కల్గించే ఆవులను పట్టించి ప్రత్యేక వాహనాల ద్వారా నగరపాలక సంస్థ బందెల దొడ్డికి తరలించడం, వీధి కుక్కలను పట్టించి ఏబీసీ ఆపరేషన్లు, వ్యాక్సిన్ కార్యక్రమాల తనిఖీ చేయాలన్నారు. శివారు కాలనీలల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు (గ్యాంగ్ వర్క్) ద్వారా కాలువలు, వీధులు శుభ్రపర్చటం వంటి కార్యక్రమాల ద్వారా మొత్తం 90 రోజులలో గుంటూరు నగరాన్ని స్వచ్ఛ గుంటూరుగా తీర్చి దిద్దే విధంగా ప్రణాళికల ద్వారా పర్యవేక్షణ చేయాలన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలు అన్యాయం

బీసీ సంఘం నాయకుడు కేసన శంకరరావు



మాట్లాడుతున్న కేసన శంకరరావు

నెహ్రూనగర్: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలు సామాజిక న్యాయ సూత్రానికి విరుద్ధమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నల్లపాడు రోడ్డులోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గతంలో సామాజిక రిజర్వేషన్లు 50శాతం మించకూడదన్న సుప్రీం కోర్టు, ఈనాడు అగ్రకుల పేదలకు ఈడబ్ల్యూఎస్ పేరిట 10శాతం ఇస్తూ పరిమితి మించిపోయేలా కేంద్రం చట్టం చేస్తే దానిని సుప్రీం కోర్టు ఏ విధంగా సమర్థిస్తుందని ప్రశ్నించారు.

సాంఘికంగా, విద్యపరంగా వెనుకబడిన వర్గాలకు మాత్రమే రిజర్వేషన్లు ఇవ్వబడ్డాయని, ప్రస్తుతం రాజ్యాంగ మౌలిక స్ఫూర్తికి విరుద్ధంగా, ఆర్థిక ప్రాతిపదికన అధిపత్య కుల పేదలకు ఈడబ్ల్యూఎస్ పేరిట రిజర్వేషన్లు అమలుచేయడం, సామాజిక న్యాయ సత్రాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. ఆధిపత్య కుల పెత్తందారీ వర్గాలతో ఆర్థికంగా వెనుకుబడిన పేదలు 10శాతం కూడా ఉండరని, పైగా వారెవరు ఎప్పుడు అడగకుండానే, ఎట్టి నిరసనలు చేపట్టకుండానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అత్యుత్సాహంతో 103వ రాజ్యాంగ సవరణ చేసి మరీ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇవ్వడం అణగారిన రిజర్వేషన్ వర్గాలకు అన్యాయం చేయడమేనన్నారు. సంఘ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ నిజంగా అగ్రకుల పేదల ఆర్థికాభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వాలు తమ బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించి, ఆర్థిక పథకాలు ద్వారా వారిని పైకి తీసుకురావచ్చన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై తొమ్మిది మంది జడ్జిలకు మించిన విస్తృత ధర్మాసనం ద్వారా విచారించి అణగారిన వర్గాలకు అన్యాయం జరగకుండా న్యాయం చేయాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి విజ్ఞప్తి చేశారు.

బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు హర్షణీయం



ప్రధాని నరేంద్ర మోదీ, మంత్రి నితిన్ గడ్కరి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

గుంటూరు మెడికల్: శంకర విలాస్ బ్రిడ్జి విస్తరణ పనుల కోసం నిధులు మంజూరు చేయడం హర్షణీయమని బీజేపీ నేతలు అన్నారు. స్థానిక శంకర్ విలాస్ సెంటర్‌లో శుక్రవారం సాయంత్రం 4వ మండల అధ్యక్షుడు పెమ్మరాజు సుధాకర్, ప్రధాన కార్యదర్శి పెద్దింటి శ్రీకృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, మంత్రి నితిన్ గడ్కరి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. జూపూడి రంగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వికసిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా బ్రిడ్జి నిర్మాణానికి రూ.98 కోట్లు నిధులు మంజూరు చేసిందని చెప్పారు. రాష్ట్ర రాజధానికి విశాఖ రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టుకు తదితర ప్రాజెక్టులకు కేంద్రం తమ వంతు సహకారాన్ని అందజేస్తుందన్నారు. బ్రిడ్జి విస్తరణ పనులు పూర్తయితే నగరవాసుల ట్రాఫిక్ సమస్య తీరుతుందని వివరించారు. కార్యక్రమంలో కొత్తూరు వెంకట సుబ్బారావు, చెరుకూరి తిరుపతిరావు, కుమార్ గౌడ్, కొక్కెర శ్రీనివాస్, దారా అంబేద్కర్, దర్శనం శ్రీనివాస్, ఆవుల వెంకటేశ్వరరావు, తాడువాయి రామకృష్ణ, ప్రతాప ప్రసాదు, ఆవుల వెంకటేశ్వరరావు, పెసల వెంకటేశ్వరరావు, స్టాలిన్, జితేంద్ర గుప్తా, పార్థసారథి, చంద్రశేఖర్, సురేష్ చౌదరి, సాయి పాల్గొన్నారు.

టీజేపీఎస్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ పీజీ కళాశాలలో శుక్రవారం ఈఏ ల్యాబ్స్ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి తెలిపారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎంసీఏ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు 60 మంది పాల్గొన్నారని తెలిపారు. రాత పరీక్ష, బృంద చర్చ, వ్యక్తిగత ఇంటర్వ్యూల ద్వారా ఎంపికలు నిర్వహించారని, ఎంపికైన అభ్యర్థులకు మూడురోజుల్లో నియామక పత్రాలు అందజేస్తారని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఈఏ ల్యాబ్స్ హెచ్ఆర్ విభాగాధిపతి జాన్ డేవిడ్ పర్యవేక్షణలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్, మేనేజ్‌మెంట్ విభాగాధిపతులు డాక్టర్ డీవీ చంద్రశేఖర్, డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.